TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY


పబ్లిషర్ : హైదరాబాద్ సంపుటి :01 సంచిక : 156 బుధవారం 29-01-2025 పేజీలు :06 వేల : 05/-

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

## ఎఐ రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకునేలా అడుగులు



**అమరావతి జనవరి 28 :** డీప్ టెక్నాలజీ, బిగ్ డేటా, ఎఐ రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకునేలా అడుగులు వేస్తామంటున్నఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. విశాఖలో స్థలాలను ఇన్ఫోసిస్ పరిశీలిస్తుందని అన్నారు. మధురవాడ వద్ద 500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు వేస్తున్నామంటూ స్పష్టం చేశారు. ఇప్పటికే విశాఖలో కార్యకలాపాల దిశగా గూగుల్, టిసిఎస్ సంస్థలు పని చేస్తున్నాయని, విప్రోను ఒప్పించే పనిలో ప్రభుత్వం ఉందని చంద్రబాబు పేర్కొన్నారు.

## ఫిబ్రవరిలో ప్రధాని మోడీ అమెరికా పర్యటన



**న్యూ డిల్లీ జనవరి 28 :** ఫిబ్రవరిలో అమెరికా పర్యటనకు ప్రధాని మోడీ వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆయన వైట్‌హౌస్‌ను సందర్శించనున్నారు. ప్రధాని మోడీ అమెరికా పర్యటనకు రాబోతున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. వచ్చే నెలలో మోడీ వైట్‌హౌస్‌లో సందర్శించే అవకాశం ఉందని తెలిపారు. ఇద్దరి నేతలు ఫోన్ కాల్ లో సంభాషించారు. ఈ క్రమంలోనే పీఎం మోడీ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో పర్యటన గురించి చర్చించినట్లు తెలుస్తోంది.ఫ్లోరిడా నుంచి జాయింట్ బేస్ ఆండ్రూస్‌కు తిరిగి వస్తుండగా ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. "సోమవారం నేను భారత ప్రధాని మోడీతో చాలాసేపు మాట్లాడాను. అతను వచ్చే నెలలో, బహుశా ఫిబ్రవరిలో వైట్ హౌస్‌కి రాబోతున్నారు. భారత్‌తో మాకు చాలా మంచి సంబంధాలు ఉన్నాయి' అని ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో ట్రంప్ అన్నారు. కాగా, రెండోసారి ట్రంప్ బాధ్యతల తర్వాత తొలిసారి ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించనున్నారు. ప్రెసిడెంట్ ట్రంప్‌తో భేటీ కానున్నారు. ఇక, తొలిసారి అమెరికా ప్రెసిడెంట్ అయిన డొనాల్డ్ ట్రంప్.. భారత పర్యటనకు వచ్చిన సంగతి తెలిసిందే.

## వేదిక కుప్పకూలి ఏడుగురు మృతి



**లక్నో జనవరి 28 :** వేదిక కుప్పకూలి ఏడుగురు మృతి చెందిన విషాద సంఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. బాగ్‌పత్‌లో మతపరమైన కార్యక్రమం నిర్వహించారు. అయితే, వెదురు చెక్కలతో ఏర్పాటు చేసిన వేదిక ప్రజల బరువుతో ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదం ఏడుగురు ప్రాణాలు కోల్పోగా..80 మందికి పైగా శిథిలాల క్రింద చిక్కుకుని గాయపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బరౌత్‌లోని జైన్ కమ్యూనిటీ మంగళవారం 'లడ్డూ మహోత్సవ్' నిర్వహించింది. ఈ క్రమంలో వందలాది మంది ప్రజలు లడ్డూను సమర్పించడానికి ఒక ఆలయానికి చేరుకున్నారు. అయితే, భక్తుల కోసం ఏర్పాటు చేసిన వెదురు వేదికపైకి వెళ్లడంతో బరువును మోయలేక అది కూలిపోయింది.ఘటన జరిగిన వెంటనే పోలీసులు, అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు బాగ్‌పత్ పోలీస్ చీఫ్ అర్పిత్ విజయవర్గియా తెలిపారు. స్వల్ప గాయాలైన వారికి ప్రథమ చికిత్స అందించి ఇంటికి పంపగా, మరికొందరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్స్



**అమరావతి జనవరి 28 :** ఎపిలో సైబర్ క్రైమ్ అనేది దేశవ్యాప్తంగా పెరిగిందని%ో%ఇతర నేరాలు తగ్గి ఈ కేసులు రాను రాను ఎక్కువతున్నాయని డిజిపి ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఈ సంర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దీన్ని ఎలా అదుపు చేయాలనే ఆలోచనలో ఉన్నామని అన్నారు. ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ పెట్టాలని సూచించారు. నిపుణులు ఉపయోగించుకోవడం.. ప్రజల్లో అవగాహన కల్పించడం ముఖ్యమని పేర్కొన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే డబ్బులు చెల్లించవద్దని కోరారు. సైబర్ క్రైమ్ నిరోధించడానికి అవగాహనే ఏకైక మార్గమని డిజిపి స్పష్టం చేశారు. చిన్న పిల్లలు, వృద్ధులపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని, ఇది సభ్య సమాజం సిగ్గు పడాల్సిన విషయమని డిజిపి ద్వారకా తిరుమల రావు తెలియజేశారు.

## 31 నుండి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు



**న్యూఢిల్లీ జనవరి 28 :** 31 నుండి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ముందుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చను లోక్‌సభ, రాజ్యసభ సోమవారం (ఫిబ్రవరి 3న) చేపట్టనున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం సాధారణ బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. రాష్ట్రపతి ప్రసంగం తరువాత కొద్ది సేపటికి శుక్రవారం లోక్‌సభ, రాజ్యసభ తిరిగి సమావేశం అయినప్పుడు ఆర్థిక శాఖ మంత్రి ఆర్థిక సర్వేను సమర్పిస్తారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు లోక్‌సభ తాత్కాలికంగా రెండు రోజులు (3, 4 తేదీలను) కేటాయించింది. ఆ చర్చకు రాజ్యసభ మూడు రోజులు కేటాయించింది.ప్రధాని నరేంద్ర మోడీ 6న రాజ్యసభలో ఆ చర్చకు సమాధానం ఇస్తారు. బడ్జెట్ సమావేశాలు సాఫీగా సాగేలా చూసేందుకు పార్లమెంట్‌లోని రాజకీయ పార్టీల సభా నాయకుల సమావేశాన్ని గురువారం (30న) పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఏర్పాటు చేశారు. బడ్జెట్ సెషన్ ప్రథమార్ధంలో 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొమ్మిది సమావేశాలు ఉంటాయి. బడ్జెట్ ప్రతిపాదనల పరిశీలన నిమిత్తం పార్లమెంట్ 13న విరామం తీసుకుంటుంది. వివిధ మంత్రిత్వశాఖల బడ్జెట్ పద్దులపై చర్చించేందుకు, బడ్జెటరీ ప్రక్రియను పూర్తి చేసేందుకు పార్లమెంట్ తిరిగి మార్చి 10న సమావేశం అవుతుంది. సమావేశాలు ఏప్రిల్ 4న ముగుస్తాయి. మొత్తం బడ్జెట్ సెషన్‌లో 27 సిట్టింగ్‌లు ఉంటాయి.

## సరిహద్దుల వద్ద జన సంద్రం



**జెరూసలేం :** ఏడాదికి పైగా సాగిన ఇజ్రాయిల్ నరమేధం కారణంగా నిర్వాసితులైన వేలాదిమంది పాలస్తీనియన్లు తిరిగి ఉత్తర గాజాలోని స్వస్థలాలకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే, సరిహద్దుల్లోనే వీరిని ఇజ్రాయిల్ దళాలు అడ్డుకుంటున్నాయి. గత 15మాసాలుగా తాత్కాలిక శిబిరాల్లో వీరు కాలం వెళ్లదీస్తూ వచ్చారు. ఇజ్రాయిల్ దాడులతో తీవ్రంగా ధ్వంసమైన తమ ఇల్లూ వాకిళ్లను, అసలక్కడ ఏమైనా మిగిలున్నాయా లేదా అనేది చూసుకోవాలన్న ఆతృత వారిలో కనిపిస్తోంది. దీంతో సరిహద్దు ప్రాంతాలు జనసంద్రాన్ని తలపిస్తున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటి నుండి తాము స్వస్థలాలకు వెళ్లేందుకు ఎదురుచూస్తున్నామని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఇజ్రాయిల్ ఆర్మీ ఆదేశాల మేరకు ఆనాడు వీరందరూ దక్షిణ గాజాకు వెళ్లిపోవాల్సి వచ్చింది. కాలినడకన వచ్చేవారు బందీగా వున్న ఇజ్రాయిల్ మహిళ అరబెల్ యహుద్‌ను, మరో ఇద్దరిని శుక్రవారానికల్లా విడుదల చేసేందుకు హమాస్ అంగీకరించిందని, పైగా ఒప్పందంలో భాగంగా మొదటి దశలో విడుదల చేసేవారి పరిస్థితిపై కూడా సమాచారం అందించామని కతార్ ప్రకటించిన నేపథ్యంలో ఇజ్రాయిల్ ఈ అనుమతిని ఆమోదించింది. ఇజ్రాయిల్-హిజ్బుల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఫిబ్రవరి 18వరకు పొడిగిస్తున్నట్లు అమెరికా, లెబనాన్ ప్రకటించాయి. గాజా ప్రజలను బలవంతంగా ఈజిప్ట్, జోర్డాన్‌లకు పంపివేయడం ద్వారా గాజాను ప్రక్షాళన చేయాలన్న ట్రంప్ ప్రతిపాదనను పాలస్తీనియన్లు తీవ్రంగా ఖండించారు. యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ కార్యకలాపాలపై విధించిన నిషేధాన్ని ఇజ్రాయిల్ అమలు చేసినట్లైతే గాజాలో సహాయక చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టడం కష్టమని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ డైరెక్టర్ రోస్ వ్యాఖ్యానించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని నూర్ షామస్ శిబిరంపై జరిగిన దాడిలో ఇద్దరు మరణించగా, ముగ్గురు గాయపడ్డారు. దక్షిణ లెబనాన్‌పై ఆదివారం ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో మరణించిన వారి సంఖ్య 24కు పెరిగింది. 12మంది చిన్నారులతోసహా 134మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

## అక్రమ వలసదారులపై భారత్‌తో చర్చలు : డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్ జనవరి 28 :** అక్రమ వలసదారులపై భారత్‌తో చర్చలు సాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలియజేశారు. 'ఏది సరైన పనో' ప్రధాని నరేంద్ర మోడీ అదే చేస్తారని అన్నారు. ఫ్లోరిడా నుంచి జాయింట్ బేస్ ఆండ్రూస్‌కు తిరుగు ప్రయాణంలో ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడినప్పుడు ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఫిబ్రవరిలో వైట్ హౌస్‌ను సందర్శించే అవకాశం ఉందని కూడా ఆయన ప్రకటించారు. విడిగా ఉభయ అధినేతల మధ్య ఫోన్ కాల్ గురించిన ఒక నివేదికను వైట్ హౌస్ చదువుతూ, మోడీతో ట్రంప్ 'ఉత్పాదక' ఫోన్ కాల్ చేశారని, భారత్, యుఎస్ మధ్య 'న్యాయమైన' ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు, ప్రగాఢ సహకారం దిశగా సాగాలని ట్రంప్ కోరారని తెలియజేసింది.కాగా సోమవారం ఫ్లోరిడా రిట్రీట్‌లో హౌస్ రిపబ్లికన్లతో అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ, అమెరికాకు 'హాని కలిగించే' దేశాలపై యుఎస్ టారిఫ్‌లు విధించగలదని చెప్పారు. ఆయన ఈ సందర్భంగా అధిక టారిఫ్ దేశాలుగా చైనా, ఇండియా, బ్రెజిల్‌లను ప్రస్తావించారు. 'మనకు నిజంగా హాని కలిగిస్తున్నారని భావించే బాహ్య దేశాలు, బాహ్య వ్యక్తులపై మనం టారిఫ్‌లు విధించబోతున్నాం. ఇతరులు ఏమి చేస్తున్నారో చూడండి. చైనా భారీగా టారిఫ్‌లు విధిస్తుంటుంది. భారత్, బ్రెజిల్, అనేక ఇతర దేశాలు కూడా. కనుక మనం అమెరికా ఫస్ట్ అనే

2లో

## 67 మంది భారతీయులకు విముక్తి

**వియంటియాన్ :** లావోస్‌లో సైబర్ స్కామ్ ముఠా చేతిలో చిక్కుకున్న 67 మంది భారతీయలను అక్కడి భారత రాయబార కార్యాలయం రక్షించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. లావోస్‌లోని బోకియో ప్రావిన్స్‌లోని గోల్డెన్ ట్రయాంగిల్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (జిటిఎస్ఇజెడ్)లో సైబర్ స్కామ్‌లకు పాల్పడే ఒక ముఠా బెదిరింపులు, బలప్రయోగంతో 67 మంది భారతీయులతో బలవంతంగా పని చేయించుకునేది. వీరు సహాయం కోసం రాయబార కార్యాలయాన్ని అభ్యర్థించారు. దీనికి స్పందించిన కార్యాలయం అధికారుల బృందాన్ని జిటిఎస్ఇజెడ్‌కు పంపింది. భారతీయుల విడుదల కోసం లావోస్ అధికారులతోనూ సమన్వయం చేసుకుంది. అవసరమైన విధానాలు, డాక్యుమెంట్లు అందజేసింది. తరువాత వారిని బోకియో ప్రావిన్స్‌లో నుంచి రాజధాని వియంటియాన్‌కు తరలించింది. అక్కడ వారికి వసతి, ఆహారంతోపాటు అవసరమైన ఇతర సహాయాలను కల్పించింది. వీరిని సురక్షితంగా భారత్‌కు

2లో

# అక్రమ వలసదారులపై భారత్‌తో చర్చలు : డొనాల్డ్ ట్రంప్

విధానాన్ని పాటించబోతున్నందున దానిని ఇక ఎంత మాత్రం జరగనివ్వం' అని ఆయన చెప్పారు. ఇది ఇలా ఉండగా, తమ ఫోన్ కాల్‌తో ఉభయ అధినేతలు మోడీ యుఎస్ పర్యటన ప్లాన్ల గురించి కూడా చర్చించారని వైట్ హౌస్ ఆ నివేదికలో తెలియజేసింది. ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడినప్పుడు 'అక్రమ వలసదారులను తిరిగి తీసుకోవడానికి ఆయన (మోడీ) అంగీకరించారా' అని ట్రంప్‌ను ప్రశ్నించారు. 'ఆయన (మోడీ) ఏది సరైనదో అదే చేస్తారు. మేము చర్చించుకుంటున్నాం' అని ట్రంప్ తెలిపారు. 'నేను ఆయనతో సోమవారం ఉదయం సుదీర్ఘ ఫోన్ కాల్ జరిగింది. ఆయన వచ్చే నెల, బహుశా ఫిబ్రవరిలో వైట్ హౌస్‌కు రానున్నారు. మాకు భారత్‌తో ఎంతో మంచి అనుబంధం ఉంది' అని ట్రంప్ ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకరులతో చెప్పారు. సోమవారం మోడీతో జరిపిన ఫోన్ కాల్‌పై ఒక ప్రశ్నకు అధ్యక్షుడు ఆ విధంగా సమాధానం ఇచ్చారు. ప్రధానితో ఫోన్ కాల్ వివరాల గురించి విలేకరులు ప్రశ్నించినప్పుడు 'మోడీతో ఫోన్ కాల్‌లో) ప్రతిదీ ప్రస్తావనకు వచ్చింది' అని ట్రంప్ సమాధానం ఇచ్చారు. ట్రంప్ 2.0 సమయంలో యుఎస్‌కు ప్రధాని మోడీ తొలి పర్యటన ఆ ఫోన్ కాల్‌లో ఖరారైంది. అధ్యక్షుడుగా ట్రంప్ చివరి విదేశీ పర్యటన ఆయన మొదటి హయాంలో భారత్‌లో జరిగింది.

# వాంగ్ యీతో సమావేశమైన భారత విదేశాంగ కార్యదర్శి



**బీజింగ్ :** భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సోమవారం బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో సమావేశమయ్యారు. భారత్, చైనా అన్ని స్థాయిలలో పరస్పర సానుకూల చర్యలను చేపట్టాయని, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాయని వాంగ్ యీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇరు దేశాలు పరస్పర అనుమానం, పరస్పర విముఖత, ఉదాసీనతకు బదులుగా పరస్పర అవగాహన, మద్దతు కోసం ముఖ్యమైన చర్యలు చేపట్టడంతో పాటు నిబద్ధత పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇరు దేశాలు ప్రయోజనకరమైన చర్చలు, కమ్యూనికేషన్ల శ్రేణిలో నిమగ్నమయ్యాయని, ఇరు దేశాల మధ్య విభేదాలను పరిష్కరించి, వివిధ రంగాలలో ఆచరణాత్మక సహకారాన్ని పున:ప్రారంభించడాన్ని ప్రోత్సహించాలని వాంగ్ యీ ఓ నివేదికలో పేర్కొన్నారు. దౌత్య సంబంధాల స్థాపన 75వ వార్షికోత్సవాన్ని సంయుక్తంగా జరుపుకునేందుకు భారత్, చైనాతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. షాంఘై సహకార సంస్థ రొటేటింగ్ చైర్‌గా చైనా తన పాత్రలో పూర్తిగా మద్దతు ఇస్తుందని అన్నారు. రెండు రోజుల చైనా పర్యటన కోసం భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఆదివారం బీజింగ్ చేరుకున్నారు.

# శామ్‌సంగ్ కార్మికుల ఘన విజయం



**చెన్నై :** తమిళనాడులోని శామ్‌సంగ్ కార్మికుల పోరాటం ఫలించింది. కార్మికుల పోరాటానికి ఆ ప్లాంట్ యాజమాన్యం దిగొచ్చి వారి సంఘానికి అధికారిక గుర్తింపు ఇచ్చింది. ఈ మేరకు ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను కార్మికులు సోమవారం అందుకున్నారు. సిఐటియు నేతృత్వంలో కొత్తగా ఏర్పాటు చేసుకున్న శామ్‌సంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్ (ఎస్ఐడబ్ల్యుయు)కు గుర్తింపు ఇవ్వాలని కోరుతూ వెయ్యి మందికి పైగా కార్మికులు గతేడాది సెప్టెంబరు 7వ తేదీ నుండి 37 రోజుల పాటు సమ్మె చేశారు. అధిక వేతనాలు, ఇతర ప్రయోజనాలు చెల్లించాలని, మరింత మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని వారు కోరారు. కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు దక్షిణ కొరియాకు చెందిన ఈ బహుళ జాతి సంస్థ యాజమాన్యం అనేక దుర్మార్గపు ఎత్తుగడలకు పాల్పడింది. యూనియన్‌ను గుర్తించాలన్న డిమాండ్ కాకుండా వేతనాలు పెంచుతామంటూ శామ్‌సంగ్ యాజమాన్యం చేసిన సెటిల్‌మెంట్‌ను కూడా సమ్మె చేస్తున్న కార్మికులు తిరస్కరించారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని కార్మికుల హక్కును పరిరక్షించాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు సిఐటియు లేఖ రాసింది.. మద్రాసు హైకోర్టు డిసెంబరులో జోక్యం చేసుకుని వారి దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాల్సిందిగా ట్రేడ్ యూనియన్ల రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. హైకోర్టు ఆరు మాసాలు గడువు విధిస్తే ఆ చివరి రోజున యూనియన్‌కు రిజిస్ట్రేషన్ అందజేశారు. దీంతో అక్టోబరు 16న కార్మికులు సమ్మెను విరమించి, విధులకు హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఈజ్ ఆఫ్ డూయింగ్' (సులభతర వాణిజ్యం) పేరుతో నయా ఉదారవాద విధానాలను అమలు చేస్తున్న తరుణంలో కార్మికులు సంఘటితంగా పోరాడి, ఈ విజయం సాధించడం స్ఫూర్తిదాయకం.

# ఓటు హక్కు వినియోగించుకున్న
## మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ



**న్యూఢిల్లీ :** మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 80 ఏళ్లకు పైబడిన వృద్ధులు, వికలాంగులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. పోలింగ్‌కు ముందే ఈ ఓట్ ఫ్రమ్ హోమ్ ప్రక్రియ పూర్తి చేస్తారు. న్యూఢిల్లీ జిల్లా ఎన్నికల కార్యాలయం ఇంటి నుంచి ఓటు వేసే సౌకర్యం కల్పించింది. మొబైల్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా హమీద్ అన్సారీ సోమవారం ఉదయం ఓటు వేశారు. అన్సారీ ఓటు హక్కు వినియోగించుకున్న ఫొటోలను న్యూఢిల్లీ జిల్లా ఎన్నికల కార్యాలయం విడుదల చేసింది. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో అధికార ఆప్, ప్రతిపక్ష బిజెపి, కాంగ్రెస్ పార్టీ మధ్య త్రిముఖపోరు నెలకొంది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ హవా కొనసాగింది. ఆ రెండు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కలేదు. బిజెపికి 2015లో 3, 2020లో 8 ఎమ్మెల్యే స్థానాలు దక్కాయి.

# గుంటూరుకు 3 ప్రాజెక్టులు తెచ్చాం

**న్యూఢిల్లీ :** గుంటూరుకు ఏడాదిలో మూడు ప్రాజెక్టులు తెచ్చామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం నాడిక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు మూడు లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. టిసిఎస్, శ్రీసిటీలో 11 ప్రాజెక్టులు, హెచ్‌సిఎల్, రిలయన్స్ సహా 49 కంపెనీలను రాష్ట్రానికి తెచ్చామన్నారు. దావోస్‌కు ముగ్గురు ముఖ్యమంత్రులు మాత్రమే వెళ్లారని, అందులో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉన్నారని తెలిపారు. గుంటూరులోని శంకర్ విలాస్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు, పెదపలకలూరు రైల్వే ప్రాజెక్టులను తీసుకొచ్చామన్నారు. గుంటూరులో రోడ్డు, రైల్వే ప్రాజెక్టుల వల్ల ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తగ్గుతాయని పేర్కొన్నారు.

# 67 మంది భారతీయులకు విముక్తి

తరలిస్తామని లావోస్‌లోని భారత రాయబారి ప్రశాంత్ అగర్వాల్ హామీ ఇచ్చారు. భారతీయుల్ని రక్షించడంలో సహాయం చేసిన లావోస్ అధికారులకు రాయబార కార్యాలయం కృతజ్ఞతలు తెలిపింది. జిటిఎస్ఇజెడ్‌లోని క్రిమినల్ సిండికేట్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. విదేశీ ఉద్యోగ అవకాశాలపై జాగ్రత్తగా ఉండాలని భారత యువతను కార్యాలయం హెచ్చరించింది. ఇప్పటి వరకూ 924 మంది భారతీయుల్ని లావోస్‌లోని రాయబార కార్యాలయం రక్షించింది. వీరిలో 857 మందిని సురక్షితంగా భారత్‌కు తిరిగి పంపించింది.

# చేతులు, కాళ్లకు బేడీలతో
## ఇమ్మిగ్రెంట్లను పంపిన తీరుపై బ్రెజిల్ ఆగ్రహం

**రియో డీ జెనీరో :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు 88మంది బ్రెజిలి యన్లను వెనక్కి పంపిన తీరు పై బ్రెజిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై ట్రంప్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఉపాధి కోసం వలస వచ్చినవారిని నేరస్తులు, ఉగ్రవాదులను చూసినట్లు చేతులకు బేడీలు వేసి విమానంలో్లు తీసుకొచ్చారు. కొంతమంది కాళ్లకు సంకెళ్లు కూడా వేశారు. పైగా ఆ విమానంలో తాగడానికి మంచి నీరు కూడా ఇవ్వలేదని, ఎసి లేదని బ్రెజిల్ విదేశాంగ శాఖ తెలిపింది. స్వదేశానికి తిప్పి పంపించే విషయంలో వారి పట్ల అమానుషంగా వ్యవహరించారని విమర్శించింది. గ్వాటెమాలా, బ్రెజిల్ వంటి పలు దేశాలకు ఇమ్మిగ్రెంటన్లను తరలిస్తూ గత కొద్ది రోజులుగా ట్రంప్ సర్కార్ తీసుకుంటున్న చర్యలపై లాటిన్ అమెరికా దేశాలు తీవ్ర అభ్యంతరం తెలిపాయి. విమానం దిగుతున్న వారు చేతులు బేడీలతో ఇబ్బందిగా నడుస్తున్న ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. వారిలో ఒకరైన కంప్యూటర్ టెక్నీషియన్ ఎడ్గర్ డ సిల్వా (31) మాట్లాడుతూ, చేతులు, కాళు కట్టేయడంతో బాత్‌రూమ్‌కు కూడా వెళ్లలేకపోయామని, తాగడానికి కనీసం నీరు కూడా ఇవ్వలేదని చెప్పారు. విమానంలో చాలా వేడిగా వుండడంతో కొంతమంది కళ్లు తిరిగి పడిపోయారన్నారు. పైగా విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో గమ్య స్థానానికి వెళ్లకుండా మధ్యలో మనాస్‌లో దింపేశారని అన్నారు. వీరందరినీ ప్రత్యేక విమానంలో వారి గమ్యస్థానాలకు చేర్చాల్సిందిగా అధ్యక్షుడు లూలా డసిల్వా ఆదేశాలు జారీ చేశారు.

# కొలంబియాపై ట్రంప్ అదనపు పన్నులు

**వాషింగ్టన్:** వలసదారులను తీసుకెళ్తున్న సైనిక విమానాలను అంగీకరించడానికి నిరాకరించినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొలంబియాపై అదనపు పన్నులు విధించారు. వలసదారులను తీసుకెళ్తున్న రెండు అమెరికా సైనిక విమానాలను దేశంలో దిగకుండా కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో అడ్డుకున్నారు. దీంతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. కొలంబియా నుండి దిగుమతి చేసుకున్న వస్తువులపై అదనంగా 25 శాతం దిగుమతి సుంకం విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. వలసదారులను బేడీలు వేసి, సైనిక విమానాలలో పంపడాన్ని కొలంబియా అధ్యక్షుడు వ్యతిరేకించారు. కొలంబియా వలసదారులను గౌరవంగా చూసుకోవాలని, అప్పటి వరకు వారు వారిని అంగీకరించారని అధ్యక్షుడు స్పష్టం చేశారు. కానీ పన్ను పెంచిన తర్వాత కొలంబియా ఏకాభిప్రాయానికి సిద్ధంగా ఉందని మీడియా నివేదిస్తోంది. ట్రంప్ అమెరికాలో అధికారం చేపట్టిన తర్వాత వలసదారుల అరెస్టులు, బహిష్కరణలు విస్తృతంగా మారాయి. ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించిన మూడు రోజుల్లోనే 538 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేశారని, వందలాది మందిని సైనిక విమానాల ద్వారా బహిష్కరించారని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ చెప్పారు. అమెరికాలో 1.10 కోట్ల మంది అక్రమ వలసదారులు ఉన్నారని అంచనా. అమెరికాలో దాదాపు 7.25 లక్షల మంది భారతీయ వలసదారులు ఎటువంటి పత్రాలు లేకుండా ఉన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత అమెరికాలో ఉండటానికి చట్టపరమైన అనుమతి లేని వారిని సామూహికంగా బహిష్కరిస్తామని ట్రంప్ అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత, వలసదారులను బహిష్కరించడం వంటి కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు.

# 15 గ్యారెంటీలతో ఆప్ మేనిఫెస్టో




**న్యూఢిల్లీ :** ఢిల్లీలో రాజ కీయాలు వేడె క్కాయి. అసెంబ్లీ ఎన్నికలకు మరో తొమ్మిది రోజులే సమయం ఉండటంతో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇక అధికార ఆమ్ ఆద్మీ పార్టీ రెండో మేనిఫెస్టోను విడుదల చేసింది. ఇప్పటికే మధ్యతరగతి ప్రజల కోసం ఆప్ మేనిఫెస్టో విడుదల చేసిన విషయం తెలిసిందే. 15 గ్యారెంటీలతో ఆ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఎంపి సంజరు సింగ్‌తో కలిసి కొత్త మేనిఫెస్టో సోమవారం విడుదల చేశారు. వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో సంక్షేమ పథకాలు, ఉపాధి కల్పన, ప్రజాసేవల్లో మెరుగుదల వంటి 15 కీలక వాగ్దానాలు చేశారు. ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలను కొనసాగిస్తామని వెల్లడించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తామని, మెట్రో ఛార్జీల్లో 50 శాతం రాయితీ ఇస్తామని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ, ప్రతి మహిళకూ రూ.2,100.. నేరుగా బ్యాంకు ఖాతాకే జమ, సంజీవని యోజన పథకం కింద 60 ఏళ్లు పైబడిన వారికి ఉచిత చికిత్స (ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య చికిత్స), నీటి బిల్లుల మాఫీ, 24 గంటల నీటి సరఫరా, యూరప్ తరహాలో రోడ్లు, యమునా నదిని శుభ్రపరచడం, డాక్టర్ అంబేద్కర్ స్కాలర్‌షిప్ పథకం, విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం, ఢిల్లీ మెట్రోలో 50 శాతం రాయితీ, అర్చకులు, గురుద్వారా గ్రంథీలకు రూ.18 వేలు గౌరవ వేతనం, కౌలుదారులకు ఉచిత విద్యుత్, నీటి సదుపాయం, మురుగునీటి వ్యవస్థలను మెరుగుపరచటం, రేషన్‌కార్డుల మంజూరు, ఆటో, ట్యాక్సీ, ఇ-రిక్షా డ్రైవర్లకు జీవిత బీమా, వారి కుమార్తె వివాహానికి రూ.1 లక్ష సాయం, పిల్లలకు ఉచిత కోచింగ్, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్‌కు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల కేటాయింపు

# మహారాష్ట్రలో తొలి జిబిఎస్ మరణం

**ముంబయి :** మహారాష్ట్రలో గిలైన్ బారె సిండ్రోమ్ (జిబిఎస్)తో తొలి మరణం సంభవించినట్లుగా అనుమానిస్తున్నారు. సోలాపూర్ జిల్లాలో 40 ఏళ్ల వ్యక్తి జిబిఎస్‌తో మరణించినట్లు ప్రాథమిక నివేదికలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో ఈనెల 18న సోలాపూర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన వ్యక్తి పరిస్థితి విషమించడంతో ఐసియులో చికిత్స పొందుతూ ఇటీవల మరణించాడని అధికారులు తెలిపారు. ప్రాథమిక నివేదికలో జిబిఎస్‌తో మరణించాడని వెల్లడైందని, పూర్తి నివేదిక రావడానికి 5, 6 రోజుల సమయం పడుతుందని తెలిపారు. పూణేలో 101 జిబిఎస్ కేసులు నమోదయ్యాయని, వారిలో 33 మంది మహిళలని రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారి ఒకరు తెలిపారు. వీరిలో 16 మంది వెంటిలేటర్ సహాయంతో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. పూణేలో జిబిఎస్ వ్యాప్తిని అంచనా వేయడానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు చెందిన బృందం పర్యటించింది. పూణే మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య విభాగం ఇప్పటి వరకూ 25,578కు పైగా ఇళ్లను సర్వే చేసింది. జిబిఎస్ అనేది ఒక ఆటో ఇమ్యూన్ న్యూరోలాజికల్ డిజార్డర్. ఇది సోకిన వారికి వారి రోగ నిరోధక వ్యవస్థ వారి నరాలపైనే దాడి చేస్తుంది. దీంతో కండరాల బలహీనత ఏర్పడుతుంది. పక్షవాతానికి కూడా దారి తీస్తుంది.

# హోంమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు



**ముధోల్ (మన వెలుగు) జనవరి 28 :** హైదరాబాదులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని ఆయన నివాసంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ లు కలిశారు. ఈసందర్భంగా హోంమంత్రితో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ముదోల్, ఆదిలాబాద్, పార్టీ స్థితిగతులపై మంత్రి చర్చించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి అయిన అంజిరెడ్డి గెలుపు కొరకు కృషి చేయాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ బాసర లో సరస్వతి అమ్మవారి ఆలయంలో జరగనున్న వసంత పంచమి ఉత్సవాలకు రావాలని మంత్రిని ఆహ్వానించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. తప్పకుండా వస్తాను, ఒకవేళ వీలుకాని పక్షంలో మరోసారి బాసరకు వస్తానని మంత్రి పేర్కొన్నారు. అంతేకాకుండా అమ్మవారి ఆలయానికి ప్రసాదం స్కీంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరుకు కృషి చేస్తానని మంత్రి హామీనిఇచ్చారు. వీరి వెంట బిజెపి యువ నాయకులు పట్టేపురం సతీష్ రెడ్డి ఉన్నారు.

# బాసర ఆలయంలో మరో ఆందోళన బాట

## - లడ్డు తయారీ కేంద్రంలో కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్న అధికారులు



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) జనవరి 28 :** రాత్రికి రాత్రి అప్పజెప్పడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న నిత్య కార్మికులు.తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న లడ్డు స్టోర్ కార్మికులు.గత 30 సంవత్సరాలుగా పని చేస్తున్న మమ్మల్ని కాదని వేరే వాళ్ళకి పనులు అప్పజెప్ప డం పై ఆగ్రహం వ్యక్త%శీ% చేస్తున్న కార్మికులు.మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్న లడ్డు స్టోర్ కార్మికులు టెండర్లలో అవకతవకలు ఉన్నాయంటూ ఆరోపిస్తున్న గ్రామస్తులు. నాలుగు నెలల క్రితం టెండర్లు నిర్వహించి రాత్రికి రాత్రి స్టోర్ ను అప్పజెప్పడం అవినీతికి నిదర్శనం అంటున్న గ్రామస్తులు,కార్మికులు.టెండరు నిర్వహించడం పట్ల అమ్మవారి ఆదాయానికి సంవత్సరానికి కోట్లలో గండి పడుతుందని అన్నీ డబ్బులు దళారుల చేతిలోకి వెళ్లకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్న బాసర గ్రామస్తులు.గతంలో జరిగిన అధికారుల తప్పులు కప్పిపుచ్చుకోవడానికి తమకు అనుకూలంగా ఉన్న వారికి టెండర్లు ఇచ్చారని ఆరోపిస్తున్న గ్రామస్తులు.అధికారులు కుమ్మక్కై తెలంగాణలో ఉన్న ప్రతి ఆలయం కంటే ఎక్కువ ధరకు టెండర్లు నిర్వహించారని ఆరోపిస్తున్న గ్రామస్తులు. లడ్డు కార్మికులకు న్యాయం చేయక పోతే రోడ్డు పై బైఠాఇస్తామని హెచ్చరించిన గ్రామస్తులు,కార్మికులు. తక్షణ మే సమగ్ర విచారణ జరిపి లడ్డూ తయారీ కేంద్రం లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు న్యాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్న లడ్డు స్టోర్ కార్మికులు.

# మంత్రి తో సమావేశమైన ఎమ్మెల్యే



**ముధోల్ (మన వెలుగు) జనవరి 28 :** జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్కతో హైదరాబాదులో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కలిశారు. బాసర లో వసంత పంచమి ఏర్పాట్లపై చర్చించారు. తక్షణమే రెగ్యులర్ ఈవో ను నియమించాలని కోరారు. గతం కంటే పెద్ద మొత్తంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వసంత పంచమికి రావాలని మంత్రిని ఆహ్వానించారు. అదేవిధంగా ప్రభుత్వం బాసర ఆలయ పునర్నిర్మాణానికి వెచ్చించిన 42 కోట్ల నిధులకు సంబంధించిన పనులను ప్రారంభించాలన్నారు. నియోజకవర్గం లో పలు సమస్యలపై ఎమ్మెల్యే పటేల్ సమావేశమై మంత్రితో చర్చించారు.

# భార్యను చంపిన భర్త



**హైదరాబాద్, జనవరి 28:** హైదరాబాద్ శివారు మీర్‌పేట్‌లో భార్యను చంపిన గురుమూర్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అసలు నిజాలు కక్కించారు. గురుమూర్తి అనడం కన్నా క్రూరమూర్తి అంటే సరిగ్గా సరిపోతుంది. భార్యను అత్యంత కిరాతకంగా చంపేసి, శరీర భాగాలను నరికేసి.. స్టవ్‌పై కాల్చేసి, పొడి చేసి చెరువులో పడేశాడీ దుర్మార్గుడు. తెలుగురాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఈ కేసును సైంటిఫిక్ ఆధారాలతో ఛేదించారు రాచకొండ పోలీసులు. నిందితుడు గురుమూర్తిని అరెస్ట్ చేసి,బిఎన్ఎస్ 103(1), 238, 85 సెక్షన్లకింద కేసు నమోదు చేశారు. హత్యకు ఉపయోగించిన 16 వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.సంక్రాంతికి వెంకటమాధవి, గురుమూర్తి తమ పిల్లలను తీసుకుని బంధువుల ఇంటికి వెళ్లారు. జనవరి 15న పిల్లలను బంధువుల ఇంటి వద్దే వదిలేసి వెంకట మాధవి, గురుమూర్తి రాత్రి ఇంటికి చేరుకున్నట్లు సీసీటీవీ ఫుటేజ్‌లో గుర్తించారు పోలీసులు. 16వ తేదీన ఉదయం మాధవితో అకారణంగా గొడవ పెట్టుకుని తీవ్రంగా కొట్టి.. తలను గోడకేసి బాదాడు గురుమూర్తి. ఆ తర్వాత ఆమెపై కూర్చుని గొంతు నులిమి చంపేశాడు. మాధవి చనిపోయిందని నిర్ధారించుకున్నాక, ఆమె కాళ్లను నరికేశాడు. తర్వాత చేతులను శరీర భాగాలను ముక్కలుగా నరికేశాడు. చివరికి తలను మొండెం నుంచి వేరే చేసి వాటర్ హీటర్ సాయంతో నీటిలో ఉడికించాడు. ఆ ఉడికించిన శరీరభాగాలను స్టవ్‌పై కాల్చి పొడిచేశాడు. ఎముకలను రోట్లో వేసి దంచి, పొడి చేసి తీసుకెళ్లి మీర్‌పేట్ పెద్ద చెరువులో పడేసినట్లు రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు.మాధవి బంధువులు నిలదీయడంతో గురుమూర్తి మిస్సింగ్ కేసు పెట్టించారు. తర్వాత పోలీసుల విచారణలో మాధవిని చంపినట్టు ఒప్పుకున్నాడు. హత్యపై సైంటిఫిక్ ఆధారాలను సేకరించామని సీపీ సుధీర్ బాబు తెలిపారు. హత్యకు కారణాలేంటో కస్టడీలో విచారిస్తామన్నారు. ఇలాంటి ఘాతుకాలకు ఇంకెవరూ పాల్పడకుండా నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. తన సర్వీసులో ఇంతవరకు ఇలాంటి దుర్మార్గపు ఆలోచన కలిగిన వ్యక్తి చూడలేదని రాచకొండ సీపీ సుధీర్ బాబు చెప్పడం విశేషం.

# భూతగాదా కేసులో నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష

**ఇబ్రహీంపట్నం (మన వెలుగు) జనవరి 28 :**వర్ష కొండ గ్రామంలో భూతగాదా కేసులో నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష. 2017లో వర్ష కొండ గ్రామంలో జరిగిన భూతగాదా కేసులో నిందితుడు రేగుంట చిన్న లక్ష్మయ్య, లస్మయ్యకు మెట్పల్లి అసిస్టెంట్ స్టేషన్స్ జడ్జ్ కోర్టు న్యాయమూర్తి డి. నాగేశ్వరరావు మంగళవారం ఐదు సంవత్సరాల జైలు శిక్ష మరియు 2000 రూపాయల జరిమానా విధించారు.2017లో వర్ష కొండ గ్రామానికి చెందిన రేగుంట చిన్న లక్ష్మయ్య,లస్మయ్య, అదే గ్రామానికి చెందిన సల్వాల రాజేందర్ అనే వ్యక్తిపై భూతగాదా నేపథ్యంలో గొడ్డలితో దాడి చేసి హత్యా ప్రయత్నం చేశాడు. బాధితుడి భార్య సల్వాల పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఇబ్రహీంపట్నం ఎస్ఐ. రాము నిందితుడిపై అత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.ఎస్.ఐ. బి రాము నిందితుడికి వ్యతిరేకంగా సాక్షాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు కేసును విచారించి నిందితుడికి శిక్ష విధించింది.అప్పటి ఇబ్రహీంపట్నం ఎస్.ఐ. బి. రాము కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేశారు.కోర్టు కానిస్టేబుల్ ఎస్. కవిత సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి వారు కోర్టుకు వాంగ్మూలం ఇచ్చేలా చేశారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మరియు మెట్పల్లి డీఎస్పీ రాములు ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేట్లు చేసిన అప్పటి ఎస్సై బి. రాము మరియు కోర్టు కానిస్టేబుల్ ఎస్. కవితను అభినందించారు.

# రబింద్ర విద్యార్థుల క్షేత్ర పర్యాటన



**ముధోల్ (మనవెలుగు) జనవరి 28 :** మండల కేంద్రమైన ముథోల్లోని రబింద్ర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బాసరలోని పద్మశాలి మార్కండేయ సత్రంలోగల మగ్గం పనిని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ అసంవార్ సాయినాథ్ మాట్లాడుతూ పద్మశాలీలు మగ్గంపై తయారు చేసే బట్టలు చాలా అద్భుతంగా ఉన్నాయని, ఇవి దక్షిణ భారతదేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారికి అలంకరిస్తారని, టెక్నాలజీ అభివృద్ధిచెందిన కాని, చేనేత చీరలకు విలువనీయడం ఒక ధర్మాన్ని పరిరక్షించడం చాలా అద్భుతమైన విషయమని అన్నారు. ఈ వృత్తి పవిత్రమైనదని చాలాకష్టంతో కూడుకున్నదని వివరించారు. ఇలాంటివి విద్యార్థులు సందర్శించడం వల్ల వృత్తిపట్ల గౌరవం పెరుగుతుందని వారిశ్రమను తెలుసుకోగలుగుతారాని సాదక బాదక విషయాలు, ఆర్థిక స్థితిగతులు అవగతము అవుతాయని వివరించారు. తదనంతరం, వృత్తి వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అనాధ పిల్లల పరిస్థితి పై స్పందించిన కేటీఆర్




**ముధోల్ (మన వెలుగు) జనవరి 28 :** ముధోల్ మండలం ఆష్ట గ్రామంలో గత మూడు రోజుల క్రితం పెన్షన్ డబ్బుల కోసం మద్యం మత్తులో తల్లిని హత్య చేసి తన సొంత పిల్లలను అనాధగా మార్చాడు. పత్రికలు-సోషల్ మీడియా- ఎలక్ట్రానిక్ మీడియా మాధ్యమాల ద్వారా పిల్లల దయనీయ పరిస్థితిని బాసర మండల బిఆర్ఎస్ కన్వీనర్ కొర్వ శ్యామ్ ముధోల్ నియోజకవర్గ సమన్వయకర్త కిరణ్ కొమ్రేవార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ కు విన్నవించడంతో తక్షణమే స్పందించి పార్టీ తరఫున గ్రామానికి వెళ్లి సాయం చేయాలని ఆదేశించారన్నారు. పార్టీ పరంగా చిన్నారులకు అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చిన్నారుల దీనగాథపై స్పందించిన బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావుల పోశట్టి, అశోక్, నాయకులు పురంశట్టి రవి, ఎర్ర%శీ% మహేష్, మమ్మాయి సాయి కృష్ణ, గౌతమ్, దత్తాపురం రవి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తాం



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) జనవరి 28 :** నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర,తమిళనాడు,కర్ణాటక నుండి వచ్చే భక్తులకు పూర్తి భద్రత కల్పించే బాధ్యత మాపై ఉంది జిల్లా ఎస్పీ.డాక్టర్ జానకి షర్మిల వెల్లడించారు.ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశాం, నిరంతరంగా సీసీటీవీ ద్వారా ప్రత్యేక నిఘ పర్యవేక్షణ ఉంటుందన్నారు, ఆలయంతోపాటు గోదావరి నది వద్ద కట్టుదిట్టమైన భద్రతతో పోలీసు సిబ్బందిని నియమిస్తాం.

# గ్యాంగ్ రేప్ కేసులో నిందితులకు 25 ఏళ్ల జైలు శిక్ష



**హైదరాబాద్, జనవరి 28:** 14 ఏళ్ల మైనర్ లంబాడా అమ్మాయిపై నలుగురు యువకులు అత్యాచారం చేశారు. ఈ ఘటన రెండు సంవత్సరాల క్రితం చత్రినాక వద్ద చోటు చేసుకుంది. నిందితులు, అమ్మాయిని మాయమాటలు చెప్పి ఓ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు మద్యం తాగించేందుకు యత్నించారు. ఆమె నిరాకరించగా, నిందితులు ఆమెను లైంగికంగా వేధించారు. ఒకరు ఆమె పొట్టపై తన్నడంతో, ఆమె అచేతనంగా పడిపోయింది. కొన్ని గంటల తర్వాత, ఆమె స్పృహ లోకి వచ్చింది. తన బట్టలు చిరిగిపోయి ఉన్నాయని, శరీరంలో నొప్పిగా అనిపించిందని తెలిపింది. ఆపై, అక్కడి నుంచి బయటకు వచ్చి పరుగెత్తి.. తల్లిదండ్రులకు జరిగిన విషయం వివరించింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులపై సామూహిక అత్యాచారం, లైంగిక వేధింపు కేసు నమోదైంది.న్యాయ విచారణలో నిందితులు అమ్మాయిని వివాహం చేసుకోవాలని కోరారు. అయితే ఆమె న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించింది. మేజిస్ట్రేట్ సమక్షంలో నిర్వహించిన ఐడెంటిఫికేషన్ పరేడ్‌లో, బాలిక నిందితులను స్పష్టంగా గుర్తించింది. కోర్టులో పలుమార్లు నిందితుల తరఫు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేసినా బాలిక ధైర్యంగా నిలబడిందని ఒక పోలీసు అధికారి తెలిపారు. కోర్టు బాలికకు రూ.7 లక్షల పరిహారం మంజూరు చేసింది. అయితే, బాలికను ఈ ప్రమాదంలోకి లాగిన స్నేహితురాలు ఇంకా జువెనైల్ న్యాయ మండలిలో విచారణ ఎదుర్కొంటోంది.ఘటన జరిగిన సమయంలో బాధితురాలు మైనర్ గా ఉన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులకు కోర్టు కఠినమైన శిక్ష విధించింది. ఇద్దరు నిందితులకు 25 సంవత్సరాల శిక్ష విధించగా, మరో ఇద్దరికి 5 సంవత్సరాల శిక్ష విధించింది. ఘటన అనంతరం బాధిత బాలికను వివాహం చేసుకునేందుకు నిందితులు సిద్ధ పడ్డారు. కానీ బాలిక న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించి నిందితులకు శిక్ష పడేలా పోరాటం చేసిందని పోలీసులు తెలిపారు